
Versatile Writer, Author Of
"The Enemy of the Mankind" and
"The Dictator of the Dark"
With Highest Number Of Records
సూర్యదేవర
రామ్ మోహన రావు
AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU
మనోగతం

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author


## సూర్యదేవర
## రామ్మోహనరావు


# మనోగతం


మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

**MANOGATAM**

(Direct Novel)

By

**SURYADEVARA RAM MOHANA RAO**

Sri Venkata Anantha Sai Nilayam

Flat No.63, Road No.71

Navanirman Colony, Jubilee Hills

Hyderabad - 500 096

E-mail : suryadevaranovelist@gmail.com

www.suryadevararammohanrao.com

www.suryadevaranovelist.com.

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 0866 - 2431969

Edition :

**2015**

Price :

**Rs. 150-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

# మనోగతం

**జీవితం–**

**అది ఒక మైనం ముద్ద లాంటిది.**

చక్కగా మలుచుకున్న వాళ్ళకి సుఖసంతోషాలనిస్తుంది. అది చేతకాని వాళ్ళకి కష్టాలు కన్నీళ్ళు మిగులుస్తుంది.

ధర్మార్ధ కామ మోక్షాలను ఎలా సాధించుకోవాలో చెప్పిన మన పూర్వీకులే, మనిషికి ప్రధాన శత్రువులు ముఖ్యంగా అంతర్గత శత్రువులయిన కామ క్రోధ మద మాత్సర్యాలను ఎలా అదుపు చేసుకోవాలో కూడా చెప్పారు. నిదానమే ప్రధానం అనేమాట ఇక్కడినుంచి పుట్టిందే.

ఒక సంఘటన చూడగానే స్పందించి తొందరపాటు నిర్ణయాలు తీసుకునేవాడు మూర్ఖుడు. వెంటనే స్పందించక... ఆలోచించి నిజానిజాలు గ్రహించి సరయిన నిర్ణయం తీసుకునేవాడు తెలివైనవాడు.

మరి ఈ ఇద్దరికీ తేడా ఏమిటంటారా?

తనేకాదు – తనతోపాటు ఇతరుల్ని, పరిసరాల్ని కూడా నాశనం చేసేవాడు మూర్ఖుడు. తను జీవిస్తూ ఇతరుల్ని, పరిసరాల్ని కూడా జీవింపసేవాడు తెలివైనవాడు.

* * * * * *

ఆవిడ పేరు భువనేశ్వరి!

వయసు ఏభై, ఏభై అయిదు మధ్య వుంటుంది. చక్కని పొడవు, తగిన లావు. అలాగని స్థూలకాయమని చెప్పలేం. వయసు తెచ్చిన సహజమైన లావు. పసిమిరంగు దేహఛాయతో... చూడగానే నమస్కరించాలనిపించే చక్కని రూపం!

పేరుకు తగినట్టే నిండుకుండలా తొణకని స్వభావం. సిటీలోని ప్రమేఖ ఇండస్ట్రియలిస్టుల జాబితాలో ఆమె పేరుకూడా వుంది.

ఆవిడ భర్త సోమశేఖరం. మంచికి మారుపేరు. ఆయన కెమికల్ ఇంజనీర్. కొంతకాలం ఒక ప్రయివేట్ కంపెనీలో పనిచేసి ఆ ఉద్యోగం వదులుకున ఇరవైమంది వర్కర్లతో అప్పట్లో స్థాపించిన చిన్న కెమికల్ ఫ్యాక్టరీ.

అది ఈ రోజు మూడువందలమంది కుటుంబాలకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పించగా, పరోక్షంగా చాలా కుటుంబాలు ఆధారపడి బ్రతుకుతున్నాయి.

ఈశ్వరి కెమికల్ ఇండస్ట్రీస్‌లో తయారయ్యే ప్రొడక్స్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది. ముఖ్యంగా ఆయిల్ పెయింట్స్ రంగులకు మరింత గిరాకీ.

దురదృష్టవశాత్తు పదేళ్ళక్రితమే భువనేశ్వరి భర్త సోమశేఖరం ఫ్యాక్టరీ పనులు అసంపూర్ణంగానే వదిలి కాలంచేయటం జరిగింది.

భువనేశ్వరికి ఆత్మ స్థయిర్యం ఎక్కువ. అందుకే భర్త పోయిన దుఃఖాన్ని దిగమింగి నడుం బిగించింది. భర్త కలల సాకారమైన ఫ్యాక్టరీని పూర్తిచేసి, ఈశ్వరి కెమికల్ ఇండస్ట్రీని విజయపథంలో నడిపించుకు వస్తోంది.

భువనేశ్వరికి ఇద్దరు కొడుకులు.

పెద్దకొడుకు పేరు రవితేజ.

చిన్నకొడుకు పేరు చంద్రతేజ.

మళ్ళీ ఇక్కడ చిన్న మెలిక వుంది.

అదేమంటే రవితేజ భువనేశ్వరి సొంతకొడుకు కాదు. ఆమాట కొస్తే దత్తత చేసుకున్న కొడుకూ కాదు. కొడుకు లాంటివాడు. కొడుకుతో సమానంగా చూడబడుతున్నవాడు.

రవితేజకి ఆ ఇంటితోగల అటాచ్‌మెంట్ ఏమిటో తెలుసుకోవాలంటే సుమారు పదిహేను సంవత్సరాలు వెనక్కి వెళ్ళాలి. భువనేశ్వరి భర్త సోమశేఖర్ బ్రతికివుండగా జరిగిన సంఘటన.

ఓరోజు షాపింగ్‌కి వెళ్ళినప్పుడు కొడుకు చంద్రతేజ రిమోట్ కారుతో ఆడుకుంటూ రోడ్‌మీదికి వెళ్ళిపోయాడు. లారీకింద పడవలసిన వాడు.

తృటిలో ప్రమాదం తప్పింది.

సమయానికి చూసిన రవితేజ చంద్రతేజను తన ప్రాణాలుసైతం లెక్కచేయకుండా కాపాడాడు. ఆ సంఘటనతో ఆ కుర్రాడికి దెబ్బలుకూడా తగిలాయి.

తమ కొడుకుని కాపాడిన అభిమానంతో ఆ కుర్రాడికి తగిన ట్రిట్‌మెంట్ చేయించారు. వివరాలు తెలుసుకుంటే మనసుకు బాధ కలిగించింది.

రవితేజకు ప్రస్తుతం నా అనేవాళ్ళు లేరు. ఉన్న ఒక్క తల్లి ఆరుమాసాలక్రితం పోయింది. ఒక మేనమామ వున్నాడు. అతను అమెరికాలో సెటిలయ్యాడు. మేనమామకు ఓ కూతురుంది. ఆ అమ్మాయి పేరు ప్రియ. ఆ అమ్మాయంటే రవితేజకు చాలా యిష్టం.

ప్రస్తుతం ఉండటానికి ఇల్లు ఉందిగాని, ఓ పూట తింటే ఓ పూట తినక ఏదో మెకానికల్ షెడ్‌లో పనిచేస్తున్నాడు. తల్లి చనిపోగానే వాడు చదువుకూడా మానేసాడు.

వాడి పరిస్థితికి జాలిపడి సోమశేఖరం దంపతులు వాడ్ని తీసుకొచ్చి తమ ఇంట్లోనే షెల్టర్ యిచ్చారు. వాడి అసలు పేరు రవీంద్ర. కాని పిలుచుకోడానికి బాగుంటుందని వాడి పేరు సూర్యతేజగా మార్చారు. తమ కొడుకు లాగే చూసుకున్నారు. చదువు చెప్పించారు.

రవితేజకి మోటార్‌ఫీల్డ్ అంటే ఇష్టం. అందుకే ఆటోమొబైల్ ఇంజనీరింగ్ చదివాడు. తన పాత ఇంటిని గేరేజ్‌గా మార్చాడు. అరడజను మంది కుర్రాళ్ళని సహాయకులుగా వేసుకున్నాడు.

టు వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్‌లో ఓన్లీ కార్స్ అతని షెడ్‌లో రిపేర్‌కి వస్తుంటాయి. ఎలాంటి చెత్త బండయినా అతని షెడ్‌లో కెళితే కొత్తబండిలా ముస్తాబవుతుందని పేరు.

అందుకే అతని షెడ్ ఎప్పుడూ బిజీగా వుంటుంది.

ఇక చంద్రతేజ ఎం.బి.ఎ. చేసాడు. కాని సోకులు, సరదాలమీద వున్న ధ్యాస అతనికి వర్క్‌మీద వుండదు. కనీసం తమ ఫ్యాక్టరీ పనులు చూడ్డానికి కూడా యిష్టపడడు. ఎప్పుడూ ఫ్రెండ్స్‌తో సరదాగా గడిపేస్తుంటాడు.

అయితే రవితేజ, చంద్రతేజలు తమ అలవాట్లు, పద్ధతుల్లో వ్యత్యాసాలు అనేకం వున్నప్పటికీ, ఇద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్. అన్నదమ్ముల్లాగే కలిసిమెలిసి వుంటారు.

“ఒరే! మీ ఇద్దరూ సూర్యచంద్రుల్లా నాకు రెండు కళ్ళురా. మీరు ఎప్పుడూ ఇలాగే వుండాలి....” ఆ యిద్దరి అన్యోన్యం చూసి మురిసిపోతూ అంది భువనేశ్వరి.

ఇదంతా గతం!

ఇక వర్తమానంలోకి వద్దాం.

* * * * * *

అది అధునాతనమైన అతి సుందరమైన భవంతి.

ఆ భవంతి యజమానురాలు భువనేశ్వరి.

ఆ భవంతిలో ఉంటున్నది ఆమెతోపాటు కొడుకులు సూర్యతేజ, చంద్రతేజలు.

ఇక ఆఇంటిని నమ్ముకొనివున్న జీవులు మూడు. ఒకటి వంటావార్పు చూసే కుక్ సరళ. అమ్మగారి కారు డ్రయివరు ఆనందం. తోటపని, ఇంటిపని చూసే రాముడు. వీళ్ళు ముగ్గురుకూడా ఆ ఇంట్లోనే వుంటారు.

ఆరోజు ఆదివారం.

ఉదయం ఎనిమిది గంటలు.

అప్పటికే డ్రస్సప్ అయి కిందకు వచ్చిన చంద్ర టిఫిన్ కోసం డైనింగ్ టేబిల్‌ని ఆశ్రయించాడు. కాని అప్పటికింకా తల్లి పూజా కార్యక్రమాలు పూర్తికాలేదు. విసుగ్గా ఎదురుచూడసాగాడు.

ఇంతలో పూజ ముగించి, పూజగదిలోంచి భువనేశ్వరి వాయిస్తున్న గంట శబ్దం వినగానే తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు.

"హమయ్య! పూజ అయింది. అయినా మమ్మీ చాదస్తంగాని, ఎందుకొచ్చిన పూజలు! భక్తి మనసులో వుంటే చాలదా? ఏమిటోగాని రాను రాను మమ్మీకి భక్తిపిచ్చి ఎక్కువైపోతోంది...." అంటూ విసుక్కున్నాడు మనసులో.

ఇంతలో హారతి తీసుకుని డ్రైనింగ్ రూమ్‌లోకి వచ్చింది భువనేశ్వరి హారతిపళ్ళెం చూసి కూడా దణ్ణం పెట్టుకోకుండా గుర్రుగా చూసాడు చంద్ర.

"ఏమిటీ. లోనకొచ్చి పూజచేయటం ఎలాగూ రాదు. కనీసం హారతి కళ్ళకద్దుకోడం కూడా కష్టంగా వుందా?" సీరియస్‌గా అడిగింది.

"నాకు ఆకలి మండిపోతుంటే, ఏమిటి పూజలు మమ్మీ. అయినా ఏడుగంటల ముందుగానే పూజ ముగిం చుకోవచ్చుగా" అని విసుక్కుంటూ హారతి కళ్ళకద్దుకున్నాడు.

"నీకోసం నా పద్ధతులు మార్చుకోను. వాడు కూడా రానీ, సూర్యరాగానే టిఫిన్ పెడతాను" అంటూ హారతిపళ్ళెం సరళకిచ్చి లోపల పెట్టమంది.

ఇంతలో రానే వచ్చాడు సూర్య.

నీట్‌గా తయారయి, వచ్చీరాగానే డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంటూ "మమ్మీ నే వచ్చేసా. నాక్కూడ కలిపి వడ్డించు" అనరిచాడు.

చురుగ్గా చూసింది భువనేశ్వరి.

"ఏమిట్రా వడ్డించాలి? వాతలా?" అంది.

ఆ మాటకి వికవికా నవ్వాడు చంద్ర.

ముఖం చిన్నబుచ్చుకున్నాడు సూర్య.

"అదేమిటి మమ్మీ! ఇప్పుడు నేనేం తప్పుచేసానని?" అడిగాడు చిన్నపిల్లాడిలా బుంగమూతిపెట్టి.

"ఏం చేసావా! ఈ వెధవ జతపట్టి నువ్వు చెడిపోతున్నావ్. ఓ పూజలేదు, పునస్కారంలేదు. కనీసం లోనకెళ్ళి దేవుడికి దణ్ణం పెట్టుకురావాలని కూడా తెలీదా?" గుర్తుచేసింది.

"ఓ సారి మమ్మీ!" అంటూ లేచాడు సూర్య.

పూజగదివైపు రెండడుగులు వేసినట్టే వేసి వెనక్కితిరిగి చటుక్కున వంగి భువనేశ్వరి పాదాలకు నమస్కరించాడు. ఆవిడ పులకించిపోతూ "ఒరే! ఏమిట్రా పిచ్చిపని... లే...లేరా" అంటూ భుజాలు పుచ్చుకుని లేపింది.

"మమ్మీ! ఆ దేవుడు ఎలా వుంటాడో తెలీదు. నాకు కన్పించే ప్రత్యక్ష దైవం నువ్వే. మధురమీనాక్షి, కంచికామాక్షి, కాశివిశాలాక్షి, బెజవాడ దుర్గమ్మ యిలా సకల మాతలకూ మూలమైన అఖిలాండేశ్వరి ఈ భువనేశ్వరిమాత నువ్వుండగా ఇంకో దైవంతో నాకేం పని మమ్మీ...." అంటూ నాటక ఫక్కీలో సూర్యడైలాగ్ చెప్పటంతో భువనేశ్వరి వాడిచెవి మెలేసి నవ్వేసింది.

"మాతా ఆకలి... కాళి అన్నపూర్ణా కరుణించు తల్లీ...." అంటూ ఓ డైలాగ్ విసిరాడు చంద్ర.

అంతే–

ఒక్కసారిగా అక్కడ నవ్వులు టపాకాయిల్లా పేలాయి. తనూ పక్కన కూర్చుని వాళ్ళిద్దరికీ టిఫిన్ వడ్డిస్తూ ముచ్చటగా చూసి.

"మీకు వయసొచ్చిందిగాని చిన్నతనం పోలేదురా. మీకు బాధ్యతలు ఎప్పుడు తెలుస్తాయో అర్థంగావటంలేదు. మీ యిద్దరూ ఇండస్ట్రీ చూసుకుంటూ, నాకు విశ్రాంతినిస్తారని ఆశించాను. నువ్వేమో మెకానిక్‌గారేజ్ పెట్టుకుని సైడయిపోయావ్. వీడేమో ఏదీ పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. మీ ఇద్దర్నీ ఎలా మార్చాలో అర్థంగావటంలేదు" అంది.

ఆమె బాధపడ్డం చూసి ముఖముఖాలు చూసుకున్నారు బ్రదర్స్ యిద్దరూ.

"డోన్ట్‌వర్రీ మమ్మీ! త్వరలోనే నేను కంపెనీ ఛార్జ్ తీసుకుని, నీకుఫుల్ రెస్ట్ ఇస్తాగదా. ప్లీజ్ మమ్మీ. ఇంకో నాలుగు ఇడ్లీలు...." అది చంద్ర రిక్వెస్ట్.

"నేను కూడా సేమ్ డైలాగ్ మమ్మీ. టైంరాగానే బ్రదర్‌కి నేను సపోర్ట్‌గా నిలబడతాగా" అంటూ సూర్య హామీ యిచ్చాడు.

కబుర్లలో హేపీగా టిఫిన్ కార్యక్రమం ముగిసింది.

చంద్ర హడావిడిగా పోబోతుంటే ఆపింది భువనేశ్వరి.

"ఎక్కడికిరా పొద్దుటే?" దబాయించింది.

"ఇంకెక్కడికి మమ్మీ, ఫ్యాక్టరీకి" చెప్పాడు చంద్ర.

"అవును మమ్మీ! వీడు మిగతారోజుల్లో ఫ్యాక్టరీవైపు తొంగిచూస్తాడో లేదోగాని ఆదివారాలు, శలవురోజుల్లో మాత్రం ఖచ్చితంగా అటే వెళతాడు" అంటూ వెక్కిరించాడు సూర్య.

"ఇడియట్. ఆదివారమని ముందు గుర్తుచేయొచ్చుగా" అంటూ కాలు తొక్కాడు చంద్ర. కీచుమంటూ కూర్చుండిపోయాడు సూర్య.

"చూడు మమ్మీ! వీడు నాకలు తొక్కాడు" అంటూ తల్లికి రిపోర్ట్ కూడా చేసాడు.

"ఊం తోడుదొంగలు. మీ గురించి నాకు తెలుసులేగాని ప్రోగ్రాం ఏమిటో చెప్పండి" అడిగిందావిడ.

"ఏంలేదు మమ్మీ. ఆదివారంగదా, ఆలా సరదాగా స్టేడియందాకా వెళ్ళి వచ్చేస్తాం" చెప్పాడు సూర్య.

"రండి. మీరు ఎక్కడ తిరిగినా సాయంత్రం నాలుగు గంటలకి ఇక్కడ వుండాలి, డాడీ పోయినరోజు. సాయంత్రం పూజలు చేయించి, అందరికీ కొత్త బట్టలుపంచే కార్యక్రమం వుంది. మిస్సయ్యారంటే నా సంగతి తెలుసుగా... బెదిరించింది.

"అబ్బే! అస్సలు మిస్‌కాము. వచ్చేస్తాం మమ్మీ" అంటూ హామీ ఇచ్చి ముందుగా బయటికి దారితీసాడు చంద్ర.

"సీయు మమ్మీ" అంటూ వెనకే అనుసరించాడు సూర్య.

ఆ యిద్దర్నీ ముచ్చటగా చూస్తూ అలాగే నిలబడింది భువనేశ్వరి.

* * * * * *

బైక్‌లు రెండూ సిటీ వీధుల్లో పరుగుతీస్తున్నాయి.

"ఒరే చంద్ర, రాను రాను నీ అబద్ధాలు ఎక్కువైపోతున్నాయి. మమ్మీ ముందు కవర్‌చేయలేక నేను ఛస్తున్నాను. కాస్త నువ్వు కంట్రోల్లో వుంటే మంచిది" దారిలో హెచ్చరించాడు సూర్య.

"నీ సంగతేమిటి బాబూ! నువ్వేమన్నా తక్కువ తిన్నావా, నీ సంగతి కూడా డిటోనే.  అది మర్చిపోకు. అయినా ఈ టైంలో స్టేడయంకి దేనికిరా? ఏముందక్కడ?" అడిగాడు చంద్ర.

"ఉంది. అక్కడ ఓ పొట్టిగొట్టాంగాడున్నాడు. మేచ్ ఫిక్సింగ్‌చేసి జనం నెత్తిన టోపీ పెడుతూంటాడు. ఇప్పుడు వాడికి మనం టోపి పెట్టాలి."

"ఎలా?"

"ఎలాగో నే చెప్తాగా. నే చెప్పినట్టు చెయ్యి చాలు."

"ఇంతకీ పోటీ ఏమిటి?"

"రజ్లింగ్."

ఓర్నాయనో! నాకు కుస్తీ పోటీలంటేనే అలర్జీ. ఏమీ తెలీదే.

"ఫ్రీ రజ్లింగ్. ఉత్తుత్తినే. ఇష్టం వచ్చినట్టు కాస్సేపు కొట్టుకుందాం. డోంట్‌వర్రీ. కమాన్."

బైక్‌లు రెండూ స్టేడియంలోకి ఎంటరయ్యాయకి.

* * * * * *

"నా పేరే ఆనందం. మీ అందరి ఆనందమే నా సంతోషం. ఈ శుభోదయంలో ఎప్పటిలాగే ఈ పోటీలకు విచ్చేసిన మీ అందరికీ స్వాగతం... సుస్వాగతం."

పొట్టివాడేగాని, గట్టివాడైన ఆనందం చుట్టూ అందర్నీ సవినయంగా చూస్తూ విన్నవించుకున్నాడు.

అక్కడ జరిగేవి తమాషా పోటీలే.

కానీ వేలు చేతులు మారుతుంటాయి.

ఉదయం జాగింగ్‌కి స్టేడియంలో ప్రాక్టీస్‌కి వచ్చే వాళ్ళను, వెర్రి వెంగళప్పలనుచేసి సులువుగా జేబులుకొట్టే తమాషా రజ్లింగ్‌ను కనిపెట్టి ప్రతినిత్యం పైసా పెట్టుబడిలేకుండా, లాభాలు ఆర్జిస్తున్నాడు ఆనందం. ఇది కూడా ఓ జూదంలాంటిదే గాబట్టి జాగింగ్‌కి వచ్చేప్పుడే జేబుల్లో కరెన్సీ కట్టలు వేసుకుని వస్తుంటారు డబ్బున్న బాబులు, ఇందులో పోలీసులకు కూడా వాటా వెళుతుందని వినికిడి.

తన మాటల్ని కంటిన్యూ చేసాడు ఆనందం.

"మీ అందరి సమక్షంలో... ఎప్పటిలాగే... ఈరోజు కూడా ఫ్రీ రజ్లింగ్ ఏర్పాటు చేస్తున్నాను. ఇందులో మోసంలేదు, దగాలేదు. ఎందుకంటే, పోరాడేది మా మనుషులు కాదు, మీలోని ఒకరు. ముచ్చటగా మూడు మేచ్‌లు నిర్వహిస్తున్నాం. ఫస్ట్ రౌండ్‌లో పోటీపడ్డానికి ఎవరు ముందుకొస్తున్నారు? గెలిచినా, ఓడినా అయిదువేలు, నెగ్గిన వాడికి పదివేలు. సో... తొడకొట్టి ముందుకొచ్చే యువకిశోరం ఎవరు?" అంటూ ఓసారి అందర్నీ చూసాడు.

"నేను" అంటూ ముందుకొచ్చాడు సూర్య.

"రమ్మనండి సార్! రజ్లింగ్ మాష్టర్ని. నాతో పోటీకి ఎవడొస్తాడో రమ్మనండి. కుమ్మేస్తాను" అంటూ తన ఫాంటు, షర్ట్ తీసేసి రెడ్ కలర్‌షర్ట్, బనీనుతో నిలబడి తన బాడీని, కండల్ని చూపిస్తూ కోడెగిత్తలా రంకెలేసాడు.

"అదీ... మగతనమంటే అలా వుండాలి. నీ పేరు చెప్పు మిష్టర్" ఉత్సాహంగా అడిగాడు ఆనందం.

"అయాం సూర్య" రకరకాల ఫోజులిచ్చి కండలు దండలుచూపిస్తూ చెప్పాడు.

"సో... మిష్టర్ సూర్యమీద పోటీకి వచ్చే మగాడు ఎవరు?" అనౌన్స్ చేసాడు ఆనందం.

"నేను... ఆ పొగరుబోతును నేను చిత్తుచేస్తాను" అనరుస్తూ ముందుకొచ్చి తన ఫాంటు, షర్టుతీసి నీలరంగు షర్ట్‌తో సూర్య పక్కన నిలబడ్డాడు చంద్ర.

“వెరీగుడ్ జోడీ, అద్భుతం. నీ పేరేమిటి మిస్టర్.”

“అయాం తేజ” కావాలనే తప్పు చెప్పాడు చంద్రతేజ.

“తేజా! వావ్... ఈ పోటీ అద్భుతం, సూర్యా, తేజ తలపడుతున్నారు. చెప్పండి బాబూ! మీ పందాలు ఎవరిమీద ఎంత త్వరగా చెప్పేస్తే పోటీ ఆరంభిద్దాం. కమాన్” అంటూ పెన్నూ, పేపరు అందుకుని బుకింగ్ ఆరంభించాడు ఆనంద్.

చంద్రకన్నా సూర్య కాస్త మోటుగాను, దురుసుగాను కన్పించటంతో ఇంచుమించు నూటికి ఎనభైశాతం సూర్యమీదే పందెం కాశారు. సూమారు లక్షా పాతికవేలు కలక్షను.

“ఓ.కె.... ఈ గేమ్‌కి పోటీపడి పందాలు కాచిన మీ అందరికీ శుభాకాంక్షలు. ఇప్పుడు నేను పోటీదారులయిన సూర్య. చంద్ర ఇద్దరకీ రహస్య ప్రమాణం చేయించి పోటీ ఆరంభిస్తున్నాను” అంటూ వాళ్ళిద్దర్నీ కాస్త దూరంగా తీసుకెళ్ళాడు ఆనందం.

“ఇంకా ఆలస్యం ఎందుకుసార్! ఈ చంద్రగాడ్ని ఇసుక మూటను కుమ్మినట్టు కుమ్మేస్తాను. పోటీ ఆరంభించండి” అన్నాడు ఆవేశంగా సూర్య.

“అంత వద్దు బాబూ! వట్టిచేతులతో కోడెగిత్తల్ని లొంగదీసిన చేతులివి. నీ కీళ్ళు విరుస్తా చూడు” అన్నాడు ఆవేశంగా చంద్ర.

“ఆగండాగండి. సదిలితే నిజంగానే కలబడి కొట్టేసుకునేలా వున్నారే. చూడండి. ఎవరు నెగ్గాలో, ఎవరు ఓడిపోవాలో నిర్ణయించేది నేను మీరు చేయాల్సిందల్లా నేను చెప్పినట్టు చేయటమే” చిన్నగా చెప్పాడు ఆనందం.

“యస్. ఫిక్సింగ్ చేయకపోతే నేను ఫిక్సయిపోతాను బాబూ! నీ మీదే అతా పందెం కాసారు. నువ్వు నెగ్గినా కొంప ముంచకు. నువ్వు ఓడిపోవాలి. చంద్ర నెగ్గాలి. అప్పుడే నాకు తోంభైవేలు మిగులుదుంది అర్థమైందా? ఇద్దరికీ సమంగా చెరో పది యిస్తాను. ఓ.కె.”

“ఓ.కె.”

“నౌ... కమాన్.”

మేచ్ ఫిక్సింగ్ జరిగిపోయింది.

సూర్య, చంద్ర యిద్దరూ, తొడలు చరిచి బరిలోకి దూకారు. అయిదు నిముషాలపాటు సూర్యదే పైచేయిగా సాగింది. ఆరో నిముషంలో చంద్ర విజృంభించాడు. మూడు నిముషాలపాటు చంద్రదే పై చేయిగా ఫైటింగ్ సాగింది.

ఆనందంకి ఒకటే ఖుషి.

సూర్య ఓడిపోతాడు.

తొంభైవేలు తన జేబులో పడిపోయినట్టే అనుకున్నాడు. కాని అయిదో నిముషంలో ఉన్నట్టుండి విజృంభించాడు సూర్య. అతనిమీద పందెం కాచిన వాళ్ళలో ఒకటే ఖుషీ, ఈలతో చప్పట్లు, కేకలతో ఆ ప్రాంతం అదిరింది.

సరిగ్గా పదో నిముషంలో కించపడిపోయాడు చంద్ర, రిఫరీ మూడు లెక్కపెట్టి సూర్యని విజేతగా ప్రకటించాడు.

అంతే–

ఆనందం గుండెల్లో రాయిపడి రెండు చేతులూ నెత్తిన పెట్టుకుని కూలబడిపోయాడు.

మేచ్ ఫిక్సింగ్ తిరగబడింది.

ఆనందం తొంభైవేలు లాస్‌కాగా సూర్యం చంద్రం ఇద్దరూ చెరో పదివేలు దబాయించి మరీ తీసుకున్నారు. ఈ పూట ఒక్క మేచ్‌తోనే ఆట నిలిచిపోయింది. దుస్తులు వేసుకుని హేపీగా భుజాలు కలుపుకొని తమ బైక్‌ల వద్దకి పోతున్న ఫ్రెండ్స్ యిద్దర్నీ చూడగానే ఆనందంకి కడుపు రగులుకుపోయి గునగునా పరిగెత్తుకొచ్చాడు.

“ఏరా... మీ ఇద్దరూ కలిసి నన్ను చీట్‌చేసి లక్ష రూపాయలకి నన్ను ముంచుతార్రా. మీ సంగతి చూస్తాను. చూడకుండా వదలను” ఈ ఆనందం అంటే ఏమనుకుంటున్నార్రా. నా పవరేమిటో చూపిస్తా. నా తడాఖా చూపిస్తా” అంటూ రంకెలేసాడు.

“ఏమిట్రా నువ్వు చూపించేది? ఒక్కటిస్తే ముక్కు ముఖం ఒక్కటయిపోతుంది. మేచ్ ఫిక్సింగ్‌లు చేసి జానాల్ని మోసం చేస్తావా? ఇంకో సారి ఈ స్టేడియంలో నీ ముఖం కన్పిస్తే, అప్పుడు చూపిస్తా తడాఖా, ఏమిటో, పోరా” అంటూ వార్నింగ్ ఇచ్చాడు సూర్యం.

వాళ్ళిద్దరూ బైక్‌లమీద వెళ్ళిపోగానే–

ఆనందం పళ్ళు కొరుకుతూ జేబులోంచి సెల్‌తీసి ఒక నంబర్‌కి ఫోన్ చేశాడు.

*   *   *   *   *   *

అసలే అది కోతి.

ఆపైన కల్లు తాగింది.

ఇంతలో తేలు కుట్టింది.

ఇక ఆ కోతి పరిస్థితి ఎలా వుంటుందో –

మనం స్పష్టంగా వూహించుకోవచ్చు.

సరిగ్గా అలాంటి పరిస్థితే ప్రాణమిత్రులు ఇద్దరిదీనూ, అసలే ఆదివారం. ఆపైన ఫ్రీ రజ్లింగ్‌లో ఆనందంని చీట్‌చేసి ఇరవై వేలు కొట్టేసారు. ఇంతలో మిత్రులు కలిసారు. ఇక చెప్పాలా.

హేపీగా మందుకొడుతూ తింటూ, పేకాడుతూ అక్కడే క్లబ్‌లో సెటిలయిపోయారు. ఎంతగా మునిగిపోయారంటే ఆఖరికి ప్రామ్ప్ట్‌గానాలుగు గంటలకి ఇంటికి వచ్చేస్తామంటూ తల్లి భువనేశ్వరికి ఇచ్చిన మాట కూడా మర్చిపోయాడు.

షార్ప్‌గా నైట్ పది గంటలకి అప్పుడు గుర్తొచ్చి పులిక్కిపడ్డాడు సూర్యం.

"మైగాడ్! కొంప మునిగిందిరా చంద్రా. లేవరా" అంటూ అరిచాడు.

ఇద్దరూ బైక్‌లు స్టార్ట్‌చేసి ఇంటికి బయల్దేరారు.

"డామిట్! ఏరా సూర్యా! నువ్వన్నా గుర్తుచేయొచ్చుగా" దారిలో అరిచాడు చంద్రం.

"నేనే గుర్తుచేసాను. మర్చిపోయావా? నీకు మందు ఎక్కువైనట్టుంది. సైలెంట్‌గా వుండు."

"“మమ్మీ గుర్తు రాగానే తాగింది మొత్తం దిగిపోయింది. గ్యారంటీగా తలుపు తీయదు. అసలే శీతాకాలం. ఈ చలిలో శివరాత్రి జాగరణ తప్పదు నాయనో."

"తప్పదని ఒప్పుకున్నావ్‌గా. ఏం చేస్తాం పద."

ఆ యిద్దరూ వూహించింది అబద్ధం ఏమీ కాదు.

భువనేశ్వరికి వాళ్లిద్దరిమీదా, పీకలదాకా వుంది కోపం. మరొకప్పుడయితే వాళ్ళని క్షమించేదే. కాని ముఖ్యమైన రోజు. తండ్రి సోమశేఖర్ గతించిన రోజు. పూజలు, వస్త్రదానం వంటి కార్యక్రమాలున్నరోజు, అసలు ఇంటి గురించి పట్టించుకోకుండా వూరిమీద పడి తిరిగితే ఏమనుకోవాలి?

తీవ్రంగా ఆలోచిస్తూ డోర్‌లోకి వచ్చింది భువనేశ్వరి.

సరిగ్గా అప్పుడే–

బైక్‌లు రెం డూ గేటుదాటి పోర్టికోవైపు దూసుకురావటం కన్పించింది. వాళ్ళు బైక్‌లు దిగుతుండగానే కోపంగా చూసి తలుపులు రెండూ ధడాలున మూసేసింది.

"మమ్మీ... ప్లీజ్, తలుపు తియ్యి" అనరిచాడు చంద్ర.

"ఏం జరిగిందో తెలీకుండా కోపగించడం అన్యాయం మమ్మీ" అనరిచాడు సూర్యం.

ఇద్దరూ కిటికీ వద్దకెళ్ళి అరిచారు.

ఆమె కిటికీలు కూడా మూసేసింది.

"మీ ఇద్దరూ కొడుకులు కారు కొడుకులయితే చెప్పిన టైంకి వచ్చేవారు. పొండిరా. ఊరిమీదే బతకండి" అనరిచి విసవిసా తన గదిలోకి పోయి పడుకుందామో. ఆమె చెంపలవెంట కన్నీరు పొంగింది.

"బ్రదరూ! ఇప్పుడెలా?" కంగారుగా అడిగాడు చంద్ర.

"ఎలా అంటే... చెప్తారా" అంటూ సూర్యం పోర్టికోనుంచి ఇవదలకి వచ్చేసాడు.

పక్కనే సన్నజాజి తీగ ఒకటి బలంగా ఎదిగి పోర్టికో పైనున్న బాల్కనీలోకి పెరిగింది. లాగి చూసాడు సూర్యం. బలంగానే వుంది.

"కమాన్" అంటూ ముందుగా తను తీగపట్టుకుని చరచరా ఎగబాకి బాల్కనీలోకి ఎక్కేసాడు. ఆ వెనకే చంద్రం కూడా పైకి ఎగబాకాడు. అప్పటికే సూర్యం బరువుకి కొంత సాగిన తీగ చివరిక్షణంలో చంద్రం బరువుకి తట్టుకోలేక కిందకు జారింది. సమయానికి సూర్యం అతడి చేయిపుచ్చుకులాగాడుగాని లేకపోతే చంద్రం కిందపడేవాడే.

"తీగమొత్తం కుప్పకూలింది. ఉదయం మనకి మమ్మీ చివాట్లు తప్పవు" అన్నాడు చంద్రం బాధపడిపోతూ.

"ఫర్వాలేదు. ఉదయానికి అవే పెసరట్లు అనుకో. ఫాలోమీ" అంటూ బాల్కనీ డోర్ తెరిచాడు సూర్యం.

ఇద్దరూ లోనకు ఎంటరయ్యారు.

గది బయట అలికిడి విని ఉలికిపడి చూసింది భువనేశ్వరి.

అంతలో–

"పాహిమాం... మాతా అఖిలాండేశ్వరి. పరమేశ్వరి... భువనేశ్వరి... రక్ష..రక్ష..రక్ష" అంటూ పౌరాణిక సినిమాలో భక్తుడి లెవల్లో ఇద్దరూ చేతులెత్తి నమస్కరించి అరుచుకుంటూ వచ్చి తల్లి పాదాల మీద వాలిపోయారు.

వాళ్ళిద్దర్నీ చురచురా చూసిందావిడ.

కోపంతో కాళ్ళు వెనక్కి తీసుకుంది.

"మాతా అన్నపూర్ణ...."

"కంచి కామాక్షి...."

"మధురమీనాక్షి... తల్లీ... నీ సహజశాంత స్వరూపాన్ని విడిచి కలకత్తా కాళిరూపం ధరిస్తే ఈ చిన్నారులు తట్టుకోలేరు తల్లీ... చిరునవ్వులు చిందే నీ దివ్యమంగళ రూపంతో సాక్షాత్కరించి భక్తుల తప్పులు మన్నించు మాతా."

"అవును మాతా, లేనిచో మీ బిడ్డలం... మీ పాదాలవద్దనే అసువులు బాసెదముగాక."

"ఒరేయ్. ఆపండ్రా మీ గోల" అంటూ చివ్వున లేచి కూర్చుందామె.

"మీరు అరిచి గోలచేసినా మిమ్మల్ని క్షమించను. అయినా లోనకెలావచ్చార్రా మీరు?" చెంపలు తుడుచుకుంటూ కోపంగా అరిచింది.

"అదేమిటి మాతా, తల్లి భవాని దర్శనం కోసం వచ్చిన గణపతిని నందీశ్వరుడు ఆపగలడా? అన్న వినాయకుడి దర్శనానికి వచ్చిన కుమారస్వామిని ఎలకపిల్ల ఆపగలదా? నీ దర్శనభాగ్యం కోసం పరితపించే మమ్మల్ని ఈ ఇంటి తలుపులు ఆపగలవా?"

"అవును జననీ! బాల్కనీ మార్గముగా లోనకి ప్రవేశించితిమి."

"ఓ.కే. మీరీ నాటకం డైలాగులు ఆపకపోతే చంపేస్తాను. ఏమనుకుంటున్నార్రా మీరు? ఇంత ముఖ్యమైనరోజు కూడా మీరు ఇంటికి రాలేదంటే మిమ్మల్ని అస్సలు క్షమించను" అరిచిందావిడ.

సూర్యం చేతులు కట్టుకుని-

దీనంగా ముఖం పెట్టి చూసాడు.

"సారీ మమ్మీ. ఇందులో మా తప్పులేదు. అనుకోకుండా అలా జరిగిపోయిందంతే. ఒరే చంద్రం ఏం జరిగిందో నువ్వు చెప్పరా" అన్నాడు.

"నేను నిజం చెప్పినా మమ్మీ అబద్ధం అనుకుంటుంది. నువ్వే చెప్పు" అన్నాడు చంద్రం.

"ఓ.కే. నేనే చెప్పెదను."

"సరిగా చెప్పి తగలడు."

"మమ్మీ. ఇక్కడినుంచి ఉదయం స్టేడియంకి వెళ్ళాము. రెండు గంటలు షటిల్ ఆడుకుని ఇంటికి బయల్దేరాం. ఇంతలో మా కోసం చందూగాడు వచ్చాడు. పున్నయ్యకి ఫాతిమాకి రిజిస్ట్రారాఫీసులో పెళ్ళని చెప్పాడు."

"వాళ్ళెవరు?"

"పున్నయ్య మా ఫ్రెండు. ఫాతిమా వాడిలవరు. వాళ్ళిద్దరూ చాలా కాలంగా దేవదాసు పార్వతిలా, లైలామజ్నూలా, సలీం అనార్కలీలా గాఢంగా ప్రేమించుకుంటున్నారు."

"బాగుందిరా. నువ్విచ్చిన ఉపమానాలు మూడు ట్రాజడీగా ముగిసాయి. వీళ్ళు కూడా అంతేనా?" వస్తున్న నవ్వుని చిక్కబట్టుకుంటూ అడిగింది భువనేశ్వరి.

"లేదు డామ్మీ. అలా కాకూడదనే మేం రంగంలోకి దిగాం" అనరిచాడు ఆవేశంగా సూరి.

"ప్రేమికులన్నా, ప్రేమకథలన్నా డాడీకి ఎంతో ఇష్టం. అటువంటి డాడీ పోయిన ఈరోజున ఇద్దరు ప్రేమికుల్ని కలపడమే డాడీకి అసలైన నివాళిగా భావించి వాళ్ళకి అండగా నిలిచాం."

కులం సాకుతో ఒకరు కట్నం సాకుతో ఒకరు పెళ్ళి ఆపాలని రౌడీలతో వచ్చారు. మేం వాళ్ళని తన్ని బుద్ధిచెప్పి పంపించి పెళ్ళి జరిపించాము. ఆ సందర్భంగా వాళ్ళిద్దరూ మా ఫ్రెండ్స్ అందరికీ పార్టీ ఏర్పాటు చేసారు. వద్దన్నా వినకుడా విస్కీలో నీళ్ళకు బదులు విస్కీయే కలిపారు మందు ఎక్కువై పడిపోయాం లేచిచూస్తే పది. పరుగులెత్తుకొచ్చాం. మమ్మీ ఆకలి మమ్మీ. ఇంకోసారి ఇలా జరక్కుండా చూసుకుంటాం. ప్లీజ్ మమ్మీ."

"అవును మమ్మీ. నువ్వు కూడా ఏమీ తినివుండవని మాకు తెలుసు. మమ్మల్ని క్షమించు మమ్మీ."

ఇద్దరూ బ్రతిమిలాడ్డంతో శాంతించింది భువనేశ్వరి. వాళ్ళిద్దర్ని తీసుకుని డైనింగ్‌రూం వైపు దారితీసింది.

* * * * * *

మరునాడు ఉదయం.

షార్ప్‌గా తొమ్మిదిగంటలకే రెడీఅయి టిఫిన్‌చేసి బయటికి బయలుదేరుతున్న చంద్రంని చూసి ఏమిట్రా విశేషం. ఎర్లీగా బయల్దేరావ్?" అంటూ క్వశ్చన్ చేసింది భూవనేశ్వరి.

"విశేషం ఏంలేదు మమ్మీ. ఫ్యాక్టరీకి బల్దేరాను" చెప్పాడు.

"అబ్బో! ఆల్‌దిబెస్ట్" అంది కొడుకు ప్రయోజకుడవుతున్నందుకు ఆమె మురిసిపోతూ.

"థ్యాంక్యూ మమ్మీ" అంటూ బయటికొచ్చి కార్లో కూర్చున్నాడు. డ్రయివరు నారాయణ కారును బయటకు దూకించాడు.

చంద్రం వెళ్ళిన కాస్సేపటికే సూర్యం రెడీ అయి తన బైక్‌మీద గారేజ్‌కి వెళ్ళిపోయాడు. చివరిగా పదిన్నరగంటలకి భువనేశ్వరి తనకార్లో బయలుదేరింది ఫ్యాక్టరీకి.

ఇంటినుంచి కొద్దిదూరం రాగానే ఒక చెట్టు పక్కన కారును చూసి డౌటువచ్చి కారాపింది.

అది తను కారే.

"డౌటే లేదు."

"ఒరే నారాయణా. ఇలారారా" అంటూ పిలిచింది.

ఆమె కంటపడకూడదని కనబడని దేవుళ్ళదంరికీ మొక్కుకుంటూ అటు తిరిగి నిలబడిన నారాయణ ఆమె పిలుపుతో అదిరిపడి గుండెలు చిక్క బట్టుకుంటూ పరుగెత్తుకొచ్చాడు.

"ఏరా... నువ్విక్కడున్నావేమిటి? చంద్రం ఎక్కడ? ఫ్యాక్టరీకి పోలేదా?" గద్దించింది.

నిజానికి జరిగిందేమంటే-

భువనేశ్వరి పదిగంటలకి షార్ప్‌గా బయలుదేరి ఫ్యాక్టరీకి వెళ్ళిపోతుంది. చంద్రం ఫ్యాక్టరీ వంకతో కారులో కాస్సేపు అలా తిరిగి ఆవిడ వెళ్ళిపోయి వుంటుందని వెనక్కి వచ్చాడు. కాని పోర్టికోలో కారు కనబడగానే యిటు వచ్చేసి ఆమె వేళ్ళేవరకు వెయిట్ చేస్తున్నారు. బేడ్‌టైమ్ దొరికిపోయారు.

"చంద్రం సార్ వెళ్ళిపోయారమ్మా. ఉదయం ఎలాగూ జాగింగ్ చేయటంలేదుకదా. నడిచి ఫ్యాక్టరీదాకా వెళితే జాగింగ్ చేసినట్టు వుంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది అని చెప్పి తను వచ్చేవరకు నన్నిక్కడె వుడమని నడుచుకుంటూ వెళ్ళిపోయారండి" అంటూ బదులిచ్చాడువాడు.

వాడి సమాధానంతో తృప్తిపడలేదామె.

"వూహూ! చివరికి నీచేత కూడా అబద్దాలు చెప్పిస్తున్నాడన్నమాట. వీడు మారడు" అను విసుక్కుంటూ కారును పోనిచ్చిందామె.

అంతవరకు కారు వెనకే దాక్కున్న చంద్రం ఆమె వెళ్ళిపోడం చూడగానే సంతోషం పట్టలేక వేగంగా వచ్చి నారాయణని కౌగిలించుకుని అభినందించాడు.

"నీలాంటి డ్రయివరు వుండటం నా అదృష్టంరా. భలే కవర్ చేశావ్. ఇంద ఈ రెండు వందలు నీకు మందుకి ఈ ఎనిమిది వందలు మాకు మందుకి. కావలసినవన్నీ తీసుకుని త్వరగా వచ్చేయ్. ఫ్రెండ్స్‌వచ్చే టైమైంది" అంటూ నారాయణని కారులో పంపించేసి తను కాలినడకన ఇంటికి చేరుకున్నాడు చంద్రం.

ఫోన్లు కొట్టగానే పావుగంటలో మిత్రబృందం ఆరుగురు బైక్‌లమీద వచ్చి చేరారు. కాసేపటికి నారాయణ కారు కూడా వచ్చేసింది. చంద్రం హాల్లోనే ఫ్రెండ్స్‌తో మందుకొడుతూ పేకాటలో మునిగిపోయాడు.

నారాయణ ఇంటిపనులు చూసే రాముడుని కలుపుకొని వరండాలో బైఠాయించి చీకు ముక్కలు తింటూ మందుతాగి మజా చేసకోసాగారు. ఇంతలో వంటమనిషి సరళ వాళ్ళ దగ్గరకొచ్చింది.

"ఏమిటిది - ఏంటి మీరు చేస్తున్న పని?" అనరిచింది యిద్దర్నీ,

"కన్పించటంలా? మందు కొడుతున్నాం. మందులో మజా నీకేం తెలుసే పిచ్చిమొగమా. రా. నువ్వూ ఓ పెగ్గు వెయ్యి తెలుస్తుంది" అన్నాడు నారాయణ.

"ఛీ నోర్ముయ్. మీరంతా అబద్దాలు చెప్పి అమ్మగార్ని మోసంచేస్తున్నారు. నేను అమ్మగారితో చెప్పి మిమ్మల్ని డిస్మిస్ చేయిస్తాను చూడండి."

"మమ్మల్ని డిస్మిస్ చేయిస్తావు సరే. చంద్రబాబుని డిస్మిస్ చేయిం చగలవా?" అంటూ వికవికా నవ్వాడు రాముడు.

"అది వాళ్ళ సొంత విషయం. మీకేం పొయ్యేకాలంరా తాగి తందనాలాడటానికి."

"మమ్మల్ని రా అంటావా! మొగుడ్ని వదిలేసిన నువ్వు మమ్మల్ని రా అంటావా. లాభంలేదురా నారాయణా. కారు స్టార్ట్ చెయ్యి. నా తలకాయ కారు కిందపెట్టి చస్తా."

"అరె ఛ... నోరుముయ్యరా, పెళ్ళాల్ని వదిలేసిన చవటలు, మీకు చచ్చేంత సీన్ లేదుగాని, ఇంకోసారి ఈ ఇంట్లో మీరు మందు కొట్టడం చూస్తే అయిపోయారే" అంటూ హెచ్చరించి లోనకెళ్ళిపోయింది.

ఇదిలా వుండగా -

అక్కడ సూర్యం.

ఇంటిదగ్గర బయలుదేరాడంటే గారేజ్‌ని చేరుకునేవరకూ ఎక్కడా ఆగే అలవాటు అతనికి లేదు. ఎప్పటిలాగే గారేజ్‌కి చేరుకున్నాడు. అప్పటికే అతని చేతికింది మెకానిక్ కుర్రాళ్ళంతా పనిలో బిజీగా వున్నారు.

తనని విష్ చేస్తున్న కుర్రాళ్ళని హుషారుగా పలకరిస్తూ సరాసరి తన ఆఫీస్‌రూంలోకి వచ్చేసాడు. బ్రీఫ్‌కేస్ టేబిల్‌మీద పెట్టి ఎదురుగా వున్న భువనేశ్వరి ఫోటోకి నమస్కరించాడు. ఇంతలో కుర్రాడొకడు లోనకొచ్చాడు.

"అన్నా! పోస్టమేన్ ఈ కవరు ఇచ్చిపోయాడన్నా" అంటూ కవర్ టేబిల్‌మీద పడేసి వెళ్ళిపోయాడు.

కవర్ అందుకుంటూనే హుషారుగా విజిల్ వేసాడు సూర్యం. భువనేశ్వరి ఫోటోవంక చూసాడు.

"నాకు తెలుసు మమ్మీ నీకు నమస్కరించగానే నాకు ఏదో ఒక మేలు జరుగుతూనే వుంటుంది చూడు. అమెరికానుంచి మావయ్య లెటర్ రాసాడు" అంటూ విన్నవించి

కవర్ చించాడు.

లోన పోస్టు కార్డుసైజు ఫోటోతో బాటు-

సింపుల్‌గా ఒక లెటర్ వుంది.

ఒరే అల్లుడూ!

నువ్వు ఫోన్‌లో చెప్పినట్టే ప్రియా ఫోటో పంపిస్తున్నాను. కష్టపడి డబ్బు సంపాదించు. ప్రియాకి నువ్వు నచ్చుతావని నా ఆశ. మిగిలిన విషయాలు ఫోన్లో.

ఉంటాను
మావయ్య మోహన్.

ఫోటో తిప్పి చూసాడు.

అప్పుడే విరిసిన బెంగుళూరు గులాబిలాంటి అందమైన యువతి ఫోటో. చూడగానే గిలిగింతలు పుట్టించే సుందరరూపం. ఎల్లోరా ఎలనాగలా, అజంతా సుందరిలా పడుచుగుండెల్ని కలవరపరిచే సూపర్ పర్సనాలిటీ, ఎప్పుడో చిన్నప్పుడు చీమిడిముక్కు, చింపిరిజుత్తులో చూసిన మరదలు పిల్లకీ, ఇప్పుడు ఫోటోలో కన్పిస్తున్న భామకీ పోలికే లేదు.

ప్రియ అందంగా వుంటుందనే ఇంతకాలం కలలుకంటూ వస్తున్నాడు. కాని ఇంత అందంగా వుంటుందని వూహించలేదు. అందుకే చూడగానే మనసు వూహల్లో తేలిపోతోంది. ప్రేమగా ఫోటోని తడివి, పెదవులాన్చి ముద్దు పెట్టుకున్నాడు.

"హలో అమెరికా మదరల్స్, ఈ ఇండియాబావ నీకు నచ్చాడంటావో, ఛీ కొడతావో అంతా నీ చేతుల్లో వుంది. నేను మాత్రం నీ లవ్‌లో పడిపోయాను. నువ్వు నా ప్రాణం అయిపోయావు.

యూనో... నీ కోసం... నువ్వు ఇండియా వచ్చేసరికి నేను నీకిచ్చే మొదటి బహుమతి ఏమిటో తెలుసా నీ కోసం స్పెషల్‌గా రూపొందిస్తున్నాను సోలార్ పవర్ కారు. నీ కోసం ఎంపికచేసి వుంచిన డిజైన్‌లో ఖరీదయిన నెక్లెస్ నీ మెడలో వేసి నిన్ను నా సరసన సోలార్ పవర్ కారులో కూర్చోబెట్టుకుని హైదరాబాద్ మొత్తం చుట్టిచూపిస్తాను. ఎప్పుడొస్తున్నావ్? నీ రాకకోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నాను తెలుసా అంటూ ఫోటోకి మరోసారి ముద్దులిచ్చి కవర్‌లో పెట్టి షెల్ఫ్‌లో దాచాడు.

తను డ్రస్ విప్పి యూనిఫాంలోకి మారి బయటికొచ్చేసరికి గారేజ్ చివరి ఒక యువకుడు కుర్రాళ్ళతో గొడవపడుతూ కన్పించాడు.

"ఏమిట్రా? ఏమిటి గొడవ?" అంటూ దగ్గరకెళ్ళాడు సూర్యం.

"చూడన్నా! పొద్దుటే బుర్ర తింటున్నాడు. ఈ బైక్ వందకిలో మీటర్లు మైలేజి ఇచ్చేదట. మనం రిపేర్ చేసాక అరవైకి మించి యివ్వటంలేదట. సరిచేయండి లేదా రిపేరు బిల్లు అమౌంట్ రిటనివ్వండి" అంటూ పేచీ పెడుతున్నాడు" అంటూ విషయం వివరించాడు కుర్రాడు.

"ఏమయ్యా. నీ వయసెంత?" అడిగాడు సూర్యం.

"ముప్పై. అయితే ఏంటి? బిరుసుగా తలెగరేసాడతను.

"రోజుకి ఎన్నిసార్లు భోంచేస్తావ్?"

"మూడుసార్లు భోంచేస్తాను. నాలుగుసార్లు టిఫిన్ చేస్తాను. అయితే ఏంటటా?"

"ఏంటటా... అనకు. ముఖం పగిలిపోతుంది. నీ వయసు ముప్పై గాబట్టి అడ్డమైన గడ్డి తింటున్నావ్, ఇదే అరవై వయసులో తినగలవా? లేదు. బళ్ళు కూడా అంతే. ఇరవై యేళ్ళనాటి బైక్ వంద కిలోమీటర్ల మేలేజ్ ఇస్తోందంటే నమ్మటానికి మా చెవిలో నీ కళ్ళకి కాకరకాయలు కన్పిస్తున్నాయా? బిల్లు పే చేయాలట. చంపేస్తా. పోరా. మళ్ళీ కంటికి కన్పిస్తే చంపేస్తా, పో."

సూర్యం కోపం చూడగానే అతని పాచిక పారదని అర్థమైనట్టుంది. బైక్ స్టార్ట్ చేసుకుని తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు వాడు.

సూర్యం అక్కడ్నించి కదిలాడు.

* * * * * *

ఆ రోజు సాయంత్రం ఒక విశేషం జరిగింది. సాధారణంగా పగలంతా పేకాడినా, సాయంత్రం తల్లి వచ్చేసమయానికి లేచిపోయి ఫ్రెండ్స్‌ని పంపించేసి పనివాళ్ళచేత ఎప్పటిలా సిద్ధంచేస్తాడు చంద్రం.

కాని ఈ రోజు చంద్రం హేండ్ బాగాలేదు.

గెయిన్‌కి బదులు లాస్ వచ్చింది.

ఆ డబ్బు రికవరీ చేయాలనే పట్టుదలతో టైం మర్చిపోయాడు. అదే కొంప ముంచింది. అటునుంచి భువనేశ్వరి కారు. ఇటునుంచి సూర్యం బైకు రెండూ ఒకేసారి ఇంటికి చేరుకున్నాయి. దాంతో చంద్రంతోబాటు అతని ఫ్రెండ్స్ కూడా బుక్కయిపోయారు.

ఫ్రెండ్స్‌మీద విరుచుకుపడింది భువనేశ్వరి. మరోసారి ఇక్కడ కన్పిస్తే పోలీస్ రిపోర్టిస్తానని బెదిరించింది. వాళ్ళంతా తిరిగిచూడకుండా పారిపోయారు. వాళ్ళు వెళ్ళగానే చంద్రంమీద మండిపడింది.

"నువ్వసలు మనిషివేనా ఎన్నిసార్లు చెప్పాల్రా. తాగటం, పేకాడటం, బాధ్యత లేకుండా తిరగటం ఇదే జీవితమా? ఉదయం ఫ్యాక్టరీకని అబద్దం చెప్పి వెనక్కి వచ్చి ఇంటిని క్లబ్బుగా మారుస్తావా?" అంటూ కోపంతో గట్టిగానే అరిచింది.

దాంతో బి.పి. పెరిగి ఒక్కసారిగా సోఫాలోకి కూలబడింది. కంగారుపడ్డారంతా. చంద్రం తల్లిని ఒళ్ళోకి తీసున్నాడు. సూర్యం కార్లో వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాడు.

కాసేపు టెన్షన్ చోటుచేసుకుందక్కడ.

డాక్టర్ ఇంజక్షనిచ్చి మందులు రాసిచ్చాడు.

"బి.పి.కి తోడు మీరు చాలా బలహీనంగా వున్నారు. ఈ వయసులో కూడా మీరిలా ఫ్యాక్టరీ పనులతో బిజీగా వుంటే ఆరోగ్యం ఏం కావాలి? బాధ్యతల్ని కొడుక్కి వప్పగించి కొంతకాలం విశ్రాంతి తీసుకోండి" అంటూ సలహా యిచ్చి డాక్టర్ వెళ్ళిపోయాడు.

భువనేశ్వరి సూర్యంవంక అభిమానంగా చూసింది.

చంద్రంవంక కోపంగా చూసింది.

"నువ్వు మారవురా చంద్రం, మారతావన్న ఆశకూడ లేదు" అంది బాధగా.

తిరిగి తనే చెప్పింది.

కడుపున పుట్టకపోయి సూర్యం చూడరా! కన్నతల్లి కన్నా ఎక్కువగా కళ్ళలో పెట్టుకుని చూసుకుంటాడు. నువ్వూ వున్నావు ఏం లాభం?" అంది.

ఆ మాటకి సూర్యం ఇబ్బందిగా చూసాడు.

"నువ్వూరుకో మమ్మీ! ఇప్పుడేమయిందని? వాడుమాత్రం ఎప్పుడూ ఇలాగే ఉంటాడా ఏమిటి? నువ్వనవసరంగా హైరానా పడకు" అన్నాడు

"అనవసరంకాదురా, అవసరమే! నువ్వు వెనకేసుకురాబట్టే వాడిలా తయావుతున్నాడు. లాభంలేదుగానీ వీడికి అర్జంటుగా పెళ్ళిచేసేయాలి. పెళ్ళాం వస్తేగాని చెప్పినమాట వినడు. అంతే" అంటూ తన మనసులో నిర్ణయాన్ని ప్రకటించింది భువనేశ్వరి.

అది వింటూనే కెవ్వుమన్నాడు చంద్రం.

"ఏమిట్రా, కండ చీమలు పీకినట్లు ఆ కేకలేమిటి?" అరిచాడు సూర్యం.

"కేకలుకాదురా, కడుపుమంట. నామీద ఇంతకుట్ర చేస్తారా... పెళ్ళాన్ని భరించటంకన్నా కండచీమల్ని భరించటం బెటర్! నాకు పెళ్ళి ఇష్టంలేదు. ఇప్పుడే చెప్పేస్తున్నాను. ఇకో మూడేళ్ళవరకూ పెళ్ళిమాట వినబడితే సహించనంతే" అంటూ తన అభిప్రాయాన్ని బలంగా డిక్లేర్ చేసాడు చంద్రం.

"ఈమాట నాతో ఎందుగ్గానీ రేపు వూరునుంచి మా అన్నయ్య, నీ కాబోయే పెళ్ళాం పల్లవిని తీసుకుని వస్తున్నాడు. నీ గోడు ఏమన్నా ఉంటే వాళ్ళతో చెప్పుకో. నువ్వు మారకపోతే మీ పెళ్ళి ఖాయం" అంటూ బెదిరించింది భువనేశ్వరి.

"మమ్మీ" అంటూ జుత్తు పీక్కుని కోపంతో లేచి వెళ్ళిపోయాడు చంద్రం.

అంతా నవ్వుకున్నారు.

మరునాడు ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో సుమో వేన్ ఒకటి పోర్టికోలోకి దూసుకొచ్చి ఆగింది.

వచ్చింది ఎవరోకాదు.

సాక్షాత్తూ చంద్రం మేనమామ ప్రకాష్. ఆయన కూతురు పల్లవి అనంతపురం నుండి వచ్చారు.

ముందుగా జీప్‌దిగిన పల్లవి "అత్తయ్యా... అత్తయ్యా" అనరుస్తూ లేడిపిల్లలా లోనకు పరుగెత్తింది.

డ్రయివింగ్ సీట్లోంచి దిగిన ప్రకాష్ అక్కడి నౌకర్లు ఇద్దర్ని పిలిచి జీప్‌లో లగేజి లోనకు చేర్చమని చెప్పి, తనూ లోనకు వెళ్ళాడు.

వేన్‌లో నాలుగు మూటలరైస్, ఒకమూట కందిపప్పు, ఒకమూట మినుములు, నాలుగు ఆయిల్ కేన్‌లతోబాటు నాలుగు అరటిపళ్ళ గెలలు, నాలుగు పనసపళ్ళు, ఇంకా కొబ్బరికాయలు ఇలా చాలా లగేజి వుంది. అవన్నీ సొంత భూమిలో పండినవే. వాటిని లోనకు చేర్చటంలో నౌకర్లు బిజీ అయ్యారు.

ఈలోపల–

లోనకొచ్చిన మేనకోడల్ని ఆప్యాయంగా పలకరించింది భువనేశ్వరి.

"ఏమిటే కోడలా....! కిందటిసారి వచ్చినప్పుడు డైటింగ్ చేస్తానత్తయ్యా. మళ్ళీ వచ్చేసరికి పదికేజీలు బరువు తగ్గిస్తానని మాటిచ్చావు. నువ్వు తగ్గావో పెరిగావో అర్థంగావటం లేదేమిటే" అనడిగింది.

"అయితే తగ్గలేదంటావా?" గడుసుగా దబాయించింది పల్లివి.

"అమ్మా భువనా! నన్నడగవే చెప్తాను. డాక్టర్ చెప్పాడని లావు పెరక్కుండా వుండేందుకు ఐస్‌క్రీంలు, చాక్‌లెట్లు తినటం పూర్తిగా మానేసిందమ్మా. కాదంటే మన తోటలోవేగదాని జీడిపప్పు, బాదంపిస్తా కష్టపడి తింటోంది... బరువు తగ్గినట్టే" అన్నాడు ప్రకాష్.

"పో డాడీ" అంటూ విసవిసా లోనకు నడిచింది.

అన్నా చెల్లెళ్ళిద్దరూ నవ్వుకుంటూ–

అక్కడే సోఫాలో సెటిలయి కబుర్లలోపడ్డారు.

హాలు చివరికొచ్చిన పల్లవికి అప్పుడే మెట్లుదిగి వస్తున్న సూర్యం కన్పించాడు.

"హలో పల్లవీ! ఎంతసేపయింది వచ్చి?" అంటూ పలకరించాడు.

"వచ్చి చాలాసేపయింది పెదబావా! చినబావ కన్పించలేదు. ఎక్కడ బావా? ఎక్కడ నా కాబోయే మొగుడు?" అంటూ వగలుపోతూ అడిగింది పల్లవి.

"రా చూపిస్తాను... అయినా వాడేమో పెళ్ళామంటే పక్కలో గండుచీమలాంటిది. పెళ్ళే వద్దంటాడు. నువ్వేమో వాడే నా మొగుడంటావ్. సంగతేంటో ఇప్పుడే తెల్సుకో! రా చూపిస్తాను... నీకు భయపడి వెనకపక్క దాక్కున్నాడు" అంటూ పల్లవిని రెచ్చగొట్టి పెరట్లోకి తరిమాడు సూర్య.

"అంతమాటన్నాడా! అయితే ఇవాళ అయిపోయాడే... చెప్తా...." అంటూ వేగంగా పెరట్లోకి వచ్చేసింది పల్లవి.

అక్కడ మల్లిపందిరికింద తీరిగ్గా కూర్చుని సిగరెట్ దమ్ము కొడుతున్న చంద్రని చూడగానే మరింత మండిపడింది.

"హలో బావగారూ! బాగున్నారా?" అంటూ పలకరించింది.

"హలో పల్లవీ వచ్చేసావా! ఏదో దేవుడి దయవలన ఇంతవరకు బాగానే వున్నాను. ఇకమీదే... ఎలా వుంటావో చెప్పలేను."

"వెక్కిరింపా! నేవచ్చానుగాబట్టి నీ పని అయిపోయిందంటున్నాను. సిగరెట్లు తాగితే దగ్గు వస్తుంది, ఆనక ఆస్మా వస్తుంది, ఆ తర్వాత క్షయ రోగం వస్తుంది. మానెయ్యరా బావా అని ఎన్నిసార్లు చెప్పాను. ఇంకా కాలుస్తూనే వున్నావా? నిన్ను... అంటూ సిగరెట్‌లాగి అవతల పారేసింది.

"పెళ్ళామంటే గండుచీమా... నీకు పెళ్ళివద్దా.. మరి నీకోసం పుట్టిన నేనెమైపోవాలి. అసలు ఏమనుకుంటున్నావు నా గురించి" అంటూ మీదపడి జుత్తుచెరిపి, ఆమె అల్లరి చేస్తుంటే బలవంతంగా నవ్వాపుకున్నాడు చంద్రం.

నవ్వితే ఆమె మరింత రెచ్చిపోయి–

షర్టు చించేస్తుందని తెలుసు.

"ఒసే పిచ్చిమొద్దు! కాసేపు నీ అల్లరి ఆపి నా మాట వింటావా?" ఆమెని లాగి పక్కన కూర్చోబెడుతూ అడిగాడు.

"నీమాట ఎప్పుడు వినలేదు. నువ్వే నన్ను దూరంగా వుంచుకున్నావు. నామీద నీకు ఇష్టంలేదు. నే ఛస్తాను. అంతే" అంది బుంగమూతిపెట్టి.

"నీమీద అన్నీ వున్నాయి. లేవని ఎందుకనుకుంటున్నావే?" అడిగాడు.

"పెళ్ళామంటే గండుచీమ అన్నావటగా?"

"ఏదీ... సూర్యంగాడు చెప్పాడా....? నిజమే. అన్నాను. కానీ ఏ సందర్భంలో ఎందుకలా అన్నానో చెప్పాడా? అదిమాత్రం చెప్పడు. మనిద్దరం సరదాగా ఉంటే వాడికి నచ్చదు. అందుకే నిన్ను నామీదకు చాడీలు చెప్పి గొడవపెడతాడు. అసలు సంగతి ఏమంటే, నాకు ఒక లక్ష్యం వుంది. అది సాధించటానికి మూడేళ్ళు పడుతుంది. కాబట్టి మూడేళ్ళదాకా పెళ్ళి వద్దన్నానుగానీ నిన్నుకాదు. నాకు పెళ్ళామై గొంతు పట్టుకునే అర్హత నీకుగాక ఎవరికుందే చెప్పు."

"నమ్మమంటావా?"

"కాబోయే మొగుడ్ని. నమ్మకపోతే ఎలా?"

"ఇంతకీ నీ లక్ష్యం ఏమిటి?"

"హిమాలయాలకుపోయి, మూడేళ్ళపాటు ఘోర తపస్సుచేయాలి."

"ఏడ్చినట్టుంది... భక్తిలోపడితే ఇక నా ముఖం చూస్తావా?"

"మరేమిటి చెప్పు.... కారణంలేందే మూడేళ్ళు గడువు పెడతానా? మమ్మీ ఒక్కతే కష్టపడుతోంది. అటు ఫ్యాక్టరీ, ఇటు వ్యాపారం. మరి నేను కూడా వర్క్ నేర్చుకుని మమ్మీని కష్టపెట్టకుండా చూసుకోవాలిగదా! నేను కూడా ప్రయోజకుడినై పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను... అది తప్పా?

"తప్పులేదుగాని బావా! మనపెళ్ళికి, దీనికి సంబంధ ఏమిటి? పెళ్ళిచేసుకుని వ్యాపారం చేసేవాళ్ళు లేరా ఏమిటి?"

"అమ్మ నా మరదలో... నీకు ఐక్యూ ఎక్కువేనేబాబూ....! ఏదో కొంతకాలం జాలీగా తిరగొచ్చనుకుంటే చచ్చు సలహాలిస్తావా...?" అని మనసులోనే అనుకుంటూ, పైకి పళ్ళికిలించి ఏదో సర్ది చెప్పబోయాడు.

కాని అంతలోనే సూర్యం ఇద్దరి ముందుకు వచ్చేస్తూ.

"బాగా చెప్పావ్ పల్లవీ! ఆ మాటకొస్తే ఎంతమంది జీవితాలు పెళ్ళయ్యాకే కుదుటపడ్డాయి. నువ్వు పట్టినపట్టు వదలకు. వెంటనే మీపెళ్ళి జరిగిపోవాలంతే నీ తరుపు నేను వాదిస్తాను" అంటూ సపోర్ట్ చేసాడు.

కాస్సేపు వాద ప్రతివాదాలు. పాపం చంద్రం. వాళ్ళిద్దరి టిజింగ్‌ను భరించలేక ఇంట్లోకి పారిపోయాడు.

* * * * * *

ఆదే రోజు సాయంత్రం క్లబ్‌లో–

ఫ్రెండ్స్ ముగ్గురితో పేకాడుతున్నాడు చంద్రం.

తొందరగా ఇంటికెళితే బావా బావా అంటూ పల్లవి బుర్ర తినేస్తుందని భయం. అందుకే ఫస్ట్‌షో ఏదో సినిమా చూసి ఇంటికి చేరుకోవచ్చని ఆలోచించి, సూర్యంకి ఫోన్‌చేసి రమ్మని చెప్పాడు.

అతనింకా రాలేదు. సూర్యం కోసం వెయిట్‌చేస్తూ చివరి గేమ్‌లో వున్నాడు చంద్రం.

ఇంతలో ఎవరో పక్కనచేరినట్టు అన్పించింది. ఆ వెనకే మాటలు కూడా విన్పించాయి.

"నా పేరే ఆనందం. అందరికీ ఆనందం కలిగించడం నా వృత్తి. కాని నీ విషయంలో మాత్రం ఏడ్పించటమే నా వృత్తి. అర్థమైందా?"

ఆ మాటలు ఎవరివో వూహించటం–

చంద్రంకి ఏమంత కష్టంకాలేదు.

"అర్థమైందిగాని– నన్ను ఏడ్పించటం నీవల్ల కాదురా పొట్టి ఆనందం. ఆగు వస్తున్నాను...." అంటూ ముక్కలు డ్రాప్‌చేసి లేచాడు చంద్రం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Manogatam**

* * *